# ఆర్‌డిటి

## ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం డిశెంబర్ 2006

FOR PRIVATE CIRCULATION ONLY


## మీకు తెలుసా !

ప్రధాన రహదారులకు 50 మీటర్లలోపు నివసించే వారికి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయట. ఎక్కువ కాలం వాహనాల కాలుష్యంవల్ల నైట్రోజన్ దయాక్సైడుకు గురికావడంవల్ల గుండె, ఊపిరితిత్తుల వ్యాధులతో మరణాలు సంభవిస్తున్నాయని జర్మనీ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

**(డౌన్‌టుఎర్త్, అక్టోబర్ 31, 2006)**

సూర్యరశ్మితో భూమిని శుద్ధిచేస్తే తెగుళ్ళను నివారించ వచ్చునని ఇజ్రాయిల్ దేశానికి చెందిన కటాన్ అనే శాస్త్రవేత్త కనిపెట్టాడు. ఈ పద్ధతిద్వారా భూమిలో నివశించే శిలీంధ్రాలద్వారా కలిగే ఎండు తెగుళ్ళు, వేరుకుళ్ళు తెగుళ్ళు, ముంగుడు తెగుళ్ళను, కొన్ని రకాల నులిపురుగులను, కలుపు మొక్కల్ని అరికట్టవచ్చునట. ఈ పద్ధతిలో మండు వేసవిలో భూమికి పశువుల ఎరువులు వేసి రెండు మూడు సార్లు లోతుగా దున్ని, నీరుకట్టి ఉపరితలం సమంగా ఉండేట్టు చూడాలి. మందపు పాలిథిన్ షీటును (తెల్లని) భూమిపై గాలి చొరబడకుండా అతికి ఉండేలా 4 నుంచి 8 వారాల వరకూ కప్పి ఉంచాలి. భూమిలో తడి ఆరకుండా మధ్య మధ్యలో నీరుపెట్టాలి. ఇలా చేస్తే భూమిలోని ఉష్ణోగ్రత 60 డిగ్రీల కంటే అధికంగా పెరిగి తెగుళ్ళు కలుగజేసే శిలీంద్రాలు నశించి జీవ నియంత్రణ కారకాలైన ట్రైకోడర్మా, గ్లియోక్లాడియం, సూడోమోనాస్, బాసిల్లస్ లాంటివి అభివృద్ధి చెందుతాయని చెబుతున్నారు. ఖర్చులేకుండా చేసుకునే జీవనియంత్రణ పద్ధతి ఇది.

**(అన్నదాత – జూన్ 2006 నుండి)**

శీతల పానీయాలు చాలా మంచివని, కోలా కంపెనీలు ప్రముఖ సినీ తారలతో ప్రచారం చేస్తున్నాయి. కాగా, ఇటీవల వివిధ నగరాలలో తాజాగా జరిపిన పరీక్షలలో శీతల పానీయాలలో హానికారక పురుగు మందుల అవశేషాలు ఉన్నట్లు స్పష్టమైంది. వీటిని తరచుగా సేవిస్తే, రొమ్ము క్యాన్సర్, లివర్ పాడయిపోవడం, పునరుత్పత్తి ప్రక్రియలు దెబ్బతినడం, అలర్జీ లక్షణాలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**(డౌన్‌టుఎర్త్, ఆగష్టు 31, 2006)**

### చిట్కా :

**పావుకప్పు ఉసిరికాయ రసానికి బాగా మెత్తగా పండిన అరటి పండు గుజ్జును కలిపి రెండు పూటలా తీసుకుంటే రక్తవృద్ధి జరుగుతుంది.**

## అమెరికా రాష్ట్రాలలో వ్యవసాయ క్షేత్రాల సందర్శన - అనుభవాలు - 6

వెనుకటి మాసపు సంచిక వరకూ వాణిజ్య ఎగుమతులు – ఆర్థిక వనరులు గురించి తెలుసుకున్నాం, తరువాత సమాచారం ఈ మాసం తెలుసుకుందాం.

### విరాళాలు - రాయితీ అమ్మకాలు

అమెరికా ప్రభుత్వ వ్యవసాయశాఖ అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి ఏజన్సీతో కలిసి ప్రపంచ వ్యాప్తంగా అవసరమైన దేశాలకు నాలుగు విభాగాలద్వారా సహాయం అందిస్తున్నది.

స్వేచ్ఛాయుత మార్కెట్టును అభివృద్ధి చేసే విధంగా వ్యవసాయ సంస్కరణలు చేబట్టే దేశాలకు అవసరం ప్రాతిపదికమీద “ఫుడ్ ఫార్ ప్రోగ్రెస్ ప్రోగ్రాం” ద్వారా ఆహార పదార్థాలను విరాళంగా అందజేస్తారు.

అభివృద్ధి చెందుతున్న మిత్ర దేశాలకు కమోడిటీ క్రెడిట్ కార్పొరేషన్ ఆధీనంలోని ఆహార పదార్థాలు సెక్షన్ 416 (బి) ద్వారా విరాళంగా అందజేస్తారు.

విశ్వవ్యాపిత విద్యాభివృద్ధిలో భాగంగా “మాల్‌గవర్న్–డోలె–అంతర్జాతీయ చదువు కోసం” ఆహారం, బాలల బలవర్ధక ఆహారం పథకాలక్రింద అమెరికా వ్యవసాయ ఆహార పదార్థాలను ఆర్థిక విరాళాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని తక్కువ ఆదాయంతో ఆహార కొరత ఉన్న దేశాలలోని బాలలకు అందజేస్తారు.

ఆహార సహాయం అవసరమయ్యే దేశాల ఆర్థిక అభివృద్ధిని వేగిర పర్చడం కొరకు పి.ఎల్.480 పథకంక్రింద రాయితీ ధరలతో ఆహార పదార్థాలు అందజేస్తారు.

### అంతర్జాతీయ సహకారం ద్వారా వ్యవసాయ సంబంధాలు :

అమెరికా ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలమధ్య ఆహార భద్రతను, వ్యాపార సంబంధాల్ని అభివృద్ధి చేసుకునే విధంగా FAS సంస్థ విశాలదృక్పథంతో అంతర్జాతీయ దేశాలతో కలిసి పని చేస్తూ ఉంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ సామర్థ్యాన్ని పెంచుకునే విధంగా FAS సంస్థ అనేక విధాలైన వాణిజ్య సామర్థ్య పెంపుదల కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తూ ఉంది.

ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) అవసరాలేమిటో అన్ని దేశాలు గుర్తించే విధంగా FAS సంస్థ సహాయం పడుతూ ఉంది. ప్రకృతికి అనుకూలంగా సుస్థిర వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఆయా దేశాలకు కీలకమైన శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన ఉపయోగాలను అందుబాటులోకి తేవడంలో FAS సంస్థ ఇతర దేశాలకు సహాయపడుతూ ఉంది. ఇందులో సరిఅయిన సంస్థలు, విధానాలు ఏర్పర్చి, ఆదాయం పెరిగి, ఆహారంలో పోషక పదార్థాలు పెంచుతూ, ఆకలికి స్థానం లేకుండా చేయడానికి ఈ సంస్థ కృషి చేస్తూ ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక సందర్భాలలో FAS సంస్థ స్పందిస్తూనే ఉంది. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ పునర్నిర్మాణం ప్రయత్నంలో తన వంతు సహాయ సహకారాలందిస్తూ ఉంది. అవసరమైన వ్యవసాయ సంస్థల్ని, విధానాల్ని ఏర్పాటు చేయడంలో సహకరిస్తూనే ఉంది.

### సమాచార సేకరణ :

దాదాపు 100 రకాల వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి FAS సంస్థ ప్రతి సంవత్సరం ఉత్పాదన, వినిమయం, వ్యాపార ఒప్పందాలు, ఇతర మార్కెట్ అవకాశాలమీద వందలకొలదీ

→

డాక్యుమెంట్లు తయారుచేస్తూ ఉంది. దీని సమాచారం ఇంటర్నెట్‌లో www.fas.usda.gov లో ఈ క్రింది సమాచారం లభ్యమవుతూ ఉంది.

**పిరీయాడికల్ రిపోర్టులు :**

దీని ద్వారా అమెరికా, ప్రపంచ ఉత్పత్తులు, సప్లై అండ్ డిమాండ్, వివిధ ఉత్పత్తుల వ్యాపారాలు, ప్రస్తుత వాణిజ్య విధానాలు, ఎగుమతుల మార్కెటింగ్ సమాచారం లభ్యమవుతుంది.

**FAS వరల్డ్ వైడ్ :**

ఇది ఇంటర్నెట్ ద్వారా లభించే త్రైమాసిక పత్రిక (మునుపు దీనికి అగ్రి ఎక్స్‌పోర్టర్ అని పేరు) ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటు గురించిన సమాచారం. వాణిజ్య విధానాలు, ఆహార సహాయం ద్వారా అంతర్జాతీయ సంబంధాల గురించిన సమాచారం. ఇందులో ఉంటుంది.

**మార్కెట్ - కమొడిటీ స్పెసిఫిక్ రిపోర్టు :**

వ్యాపార విశేషాలు, విదేశాల దిగుమతిదారుల జాబితా, అమెరికా ఎగుమతులు చేసే వస్తువుల జాబితా, ఇతర అవసరమైన సమాచారం.

**కొత్త విడుదలలు - కార్యక్రమాల ప్రకటనలు :**

FAS విధానాలు, కార్యక్రమాల గురించి సమాచారం లభిస్తుంది.

ఈ FAS (విదేశీ వ్యవసాయ సర్వీసు) గురించిన సమాచారం పైన తెల్పిన జాతీయ సమాచార సర్వీసు నుండి టెలిఫోను నెంబర్లు (800) 363-2068 లేదా (703) 605-6060

**భవిష్యత్తు సవాళ్ళు :**

FAS ప్రధాన సర్వీసులు - మార్కెటును గురించిన సమాచార సేకరణ దానిని అందుబాటులోకి తేవడం, అభివృద్ధి పర్చడం, మార్కెటు విధానాలను రూపొందించడం, పర్యవేక్షించడం, ఆహార సహాయం, ఇతరత్రా అనుబంధ విషయాలు, ఈ విషయాలన్నీ రాబోయే కాలంలో మరింత ప్రాధాన్యత నొందుతాయని అంచనా వేయబడుతున్నది. అలాగే అమెరికా వ్యవసాయ ఎగుమతులలో ఎదురయ్యే ప్రతిబంధకాలను అధిగమించడానికి ప్రత్యేక శ్రద్ధ చూపే పరిస్థితి ఉన్నది.

**ఫారెస్టు సర్వీసు**

ఫారెస్టు సర్వీసు అంటే ఏమిటి ?

అమెరికా వ్యవసాయ శాఖ అనుబంధశాఖ ఫారెస్టు సర్వీసు. ఇది జాతీయ అటవీ ప్రాంతంలో ప్రభుత్వ భూమిని, పచ్చిక బయళ్ళను పర్యవేక్షిస్తుంది. ఇది ప్రపంచం మొత్తంమీదనే అతిపెద్ద ఫారెస్టు పరిశోధనా సంస్థగా ఎదిగి ప్రైవేట్, ప్రభుత్వ ఫారెస్టు ఏజన్సీలకు అవసరమైన సాంకేతిక, ధన సహాయం అందజేస్తుంది. ఫారెస్ట్ సర్వీసు మొదటి ప్రధానాధికారి గిఫర్డ్ పించాట్ ఫారెస్ట్ సర్వీసు యొక్క ఉపయోగమేమిటో ఒక్క మాటలో వివరించారు. "దీర్ఘకాలంలో ప్రజల ప్రయోజనాలకోసం ఫారెస్టు సర్వీసును అభివృద్ధి పర్చడమని వాఖ్యానించాడు. తమ దృక్పథం, పరిశీలన, ఆచరణ సూత్రాల గురించి తెలుసుకోవలసిందిగా కోరాడు.

**ఫారెస్టు సర్వీసును ఎందుకు, ఎప్పుడు ఏర్పరిచారు ?**

అమెరికా కాంగ్రెస్ 1905లో జాతీయ అవసరాలనిమిత్తం శుద్ధమైన నీరు, కలప సరఫరాల కోసం ఈ సంస్థను ఏర్పరిచింది. కాలక్రమేణా ప్రజలు జాతీయ అడవుల నుండి పచ్చిక బయళ్ళనుండి కావలసిన అవసరాల సంఖ్యను పెంచివేశారు. అమెరికన్ కాంగ్రెస్ ప్రజల అవసరాన్ని గుర్తించి ఈ సంస్థను ప్రకృతి వనరులైన నీరు, వన్య ప్రాణులు, కలప, విహార యాత్రా స్థలాలకోసం సుస్థిరమైన అభివృద్ధితో ఈ వనరులు ప్రజలకు ఉపయోగపడే విధంగా కృషి చేయాలని ఆదేశించింది. ప్రకృతి వనరుల మూలాలకు ఏ మాత్రం విఘాతం కలుగకుండా వీటిని ప్రజలకు లభించేట్లు చేయడానికి సంస్థకు బాధ్యత అప్పగించారు.

జాతీయ అడవులు అమెరికా గొప్ప విశాలమైన అటవీ క్షేత్రాలు దాదాపు 77.3 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయి. ఇవి టెక్సాస్ రాష్ట్ర వైశాల్యంతో సమానం. సహజసిద్ధమైన ప్రకృతి సుందర ప్రదేశాలలో, విహారయాత్రలకు నేషనల్ ఫారెస్టు సర్వీసు ప్రోత్సాహం ఇస్తోంది. పట్టణ ప్రాంతాలలో జనసాంద్రత పెరుగుతున్న కొద్దీ, అమెరికా ప్రజలకు జాతీయ అడవులు ఎంతో విలువైనవిగా మారుతున్నాయి. అమెరికా ప్రజలు మారుమూల అటవీ ప్రాంత శోధన, దారితెన్నూలేని అటవీ ప్రాంతాల సందర్శన, ఎగుడు దిగుడు ప్రాంతాలలో మోటారు వాహనాలను నడిపించడం, అటవీ ప్రకృతి సహజ సౌందర్యాలను వీక్షించడం, సరస్సులు, నదులలో చేపలు పట్టడం లాంటి మనో వికాస యాత్రల సంఖ్య పెరిగిపోతున్నది.

**ఫారెస్టు సర్వీసు ఉపయోగాలు :**

వచ్చే శతాబ్దాలలో కూడా అటవీ ప్రాంతాలను సంరక్షించడం, ప్రజలు అటవీ ప్రాంతాలకు హానిలేకుండా అనుభవంలోనికి తీసుకోవడాన్ని ప్రోత్సహిస్తుంది. అటవీ సంరక్షణలో ప్రజలను ప్రధాన పాత్రధారులుగా గుర్తించింది. అటవీ సంరక్షణ, ఉపయోగాలపట్ల ప్రజలు ఎవరైనా నిరభ్యంతరంగా సలహాలు ఇవ్వవచ్చును. నిర్ణయాలు తీసుకునే దిశగా సంస్థను ప్రభావితం చేయవచ్చును.

ఈ సంస్థ యొక్క ప్రధాన ఆశయం "ప్రజల ఉపయోగానికి అడవులను సంరక్షించడం". ఈ సంస్థ ప్రధాన ఆశయాలలో ఈ క్రింది కార్యక్రమాలు అమలుపర్చబడుతున్నాయి.

★ జాతీయ అటవీ భూములలో సహజవనరులను సంరక్షించడం, వాటిని అభివృద్ధిపర్చడం.

★ అటవీ యాజమాన్యం, అటవీ ఉత్పత్తుల వినియోగం మీద పరిశోధనలు కొనసాగించడం.

★ నాన్ ఫెడరల్ ఫారెస్టు భూములు, వాటర్‌షెడ్ భూముల సామర్థ్యాన్ని అభివృద్ధిపర్చి, గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను మెరుగుపర్చడంలోనూ, అటవీ ఉత్పత్తుల పరిశ్రమలను అభివృద్ధి పర్చడంలో ప్రజల సహకారం, రాష్ట్ర స్థానిక ప్రభుత్వాల సహకారం, ప్రైవేట్ భూయజమానుల సహకారాన్ని ఈ సంస్థ తీసుకుంటోంది.

★ అమెరికా ప్రజల జీవన వైవిధ్యాన్ని పెంచే దిశగా అవసరమైన నైపుణ్యం కలిగిన శ్రామిక సంఖ్యను అభివృద్ధి పర్చడం, ఈ దిశగా తన లక్ష్యాన్ని సాధించడం.

★ ప్రపంచ అటవీ, వనరుల సంరక్షణలో తగు విధానాలను రూపొందించడం, ఇతర సంస్థల, దేశాలతో కలిసి పనిచేయడం, తగు సహాయ సహకారాల్ని అందించడం.

(మిగతా తరువాత సంచికలో)

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఏకాలజి**

## నీతి వాక్యం :

అII నీరము తప్తలోహమున నిల్చి యనామకమై నశించు, నా
నీరమే ముత్యమట్లు నళినీదళ సంస్థితమై తనర్చు, నా
నీరమే శుక్తిలోఁబడి మణిముత్యముఁగాంచు సమంచిత ప్రభం
చౌరుష వృత్తులిట్లధము మధ్యము నుత్తముఁగొల్పు వారికిన్

– భర్తృహరి

## తాత్పర్యము:

బాగా కాలిన ఇనుము మీద నీటి బిందువుపడితే అది వెంటనే ఆవిరై పోతుంది. దాని అసలు రూపు నాశనమై పోతుంది. అదే నీటి చుక్క తామరాకుమీద పడితే, ముత్యం మాదిరిగా కన్పిస్తుంది. అదే బిందువు సముద్రంలోని ముత్యపు చిప్పలో పడితే మంచి ముత్యంలా రూపొందుతుంది.

## చర్చ :

అతి సాధారణంగా కనిపించే నీటి చుక్క ఆయాచోట్లపడి ఎలా రూపాంతరం చెందుతుందో భర్తృహరి మనకు దీని ద్వారా నీతిని ఉపదేశిస్తున్నారు. బాగా కాలిన ఇనుము మీద నీటి చుక్క నిలువదు. వెంటనే అదృశ్యమైపోతుంది. దుర్మార్గుణ్ణి, దుష్టుణ్ణి మనం ఎంత మార్చాలని ప్రయత్నం చేసినా, మన అస్థిత్వమే మారిపోతుంది. మన శ్రమంతా వృధా అయిపోతుంది. దుర్మార్గులతోనూ, దుష్టులతోనూ మనం దూరంగా ఉండాలని, మన సమయం వారికోసం ధారపోయకుండా ఉండాలని చెప్పే ఉపమానం ఇది. అదే విధంగా తామరాకు పడిన నీటి చుక్క సూర్యకిరణాలుపడి ముత్యంలా ప్రకాశించి మనల్ని భ్రమింపచేస్తుంది. కానీ ముత్యం కాదు. రాజకీయ నాయకులు ఈ కోవకు చెందినవారు. వీరు చేసే వాగ్దానాలు, వారి జీవిత విధానాలు మనల్ని ఆకర్షిస్తాయి. వారు చెప్పే వాగ్దానాలలో నిజం ఉందని నమ్ముతాము. కానీ అవన్నీ అశాశ్వతాలని కొద్ది కాలం తరువాతగానీ మనకు తెలియదు. అలాగే చాలా మంది అవినీతి పరుల జీవిత విధానాలు చాలా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ అవి ఏ నీతి సూత్రాలకు, చట్టాలకు నిలువవు. వీరితో ఎంతకాలం సాంగత్యం నెరిపినప్పటికీ ఏమీ ఫలితం ఉండదు; నిరాశతప్ప. అలాగే వాన చినుకు ముత్యపు చిప్పలో పడితే ముత్యంగా తయారవుతుంది. అంటే సరిఅయిన నీతివంతమైన పని. మంచి పని చేస్తే, అది కొంచెం అయినా మంచి ఫలితాల్నిస్తుంది. అలాగే మంచివారు, మంచి నడవడికగల సత్యసంధ్యులతో మనం కాలాన్ని వెచ్చించినా, వారి నుంచి ఎంతో విలువైన పరిజ్ఞానం, విజ్ఞానం పొందుతామే తప్ప నిరాశ మిగలదు.

**వై.వి. మల్లారెడ్డి**

## ఈ మాసంలో వ్యవసాయం

### ఏ పంటలో ఏం చేయాలి ? !

## కొన్ని పంటలలో ఎన్.పి.ఎం. పై సూచనలు

### పత్తిపంటలో కాయతొలిచే పురుగులను అదుపుచేసే పద్ధతి :

**పత్తిపంట :**

పత్తిపంటపై ముఖ్యంగా రెండురకాల పురుగులు ఆశిస్తుంటాయి :

1. రసం పీల్చే పురుగులు – పంటను లేత దశలో ఆశిస్తాయి.
2. కాయతొలిచే పురుగులు – పంటను పూత, కాయ దశలలో ఆశిస్తాయి (సెప్టెంబర్ నుండి జనవరి వరకు)

   కాయతొలిచే పురుగులలో శనగ పచ్చపురుగు, పొగాకు లద్దె పురుగు, గులాబి రంగు పురుగు చాలా ముఖ్యమైనవి.

**నివారణ చర్యలు :**

1. పత్తి పంటలో ఎర పంటగా బంతిపూల మొక్కలను (శనగ పచ్చపురుగు), ఆముదం మొక్కలను (పొగాకు లద్దె పురుగు) ఎకరాకు 100 మొక్కల లెక్కన నాటుకోవాలి.
2. అంతర పంటలుగా అలసంద, పెసర, సోయాచిక్కుడులను వేసుకోవాలి.
3. ఎకరాకు 10 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.
4. విత్తిన 45 రోజుల తర్వాత ఎకరాకు 50,000 ట్రైకోగ్రామా పరాన్న జీవులను మూడు లేదా నాలుగు సార్లు వదలాలి.
5. చేనిలో జిల్లేడు మొక్కలు నాటాలి. వాటిని ఆశించిన పొగాకు లద్దె పురుగు గుడ్ల సముదాయాన్ని, పురుగులతో సహా జిల్లెడు ఆకులను ఏరి కాల్చివేయాలి.
6. ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలను ఏర్పరిచి పురుగుల ఉనికిని గమనించాలి.
7. పొలంలో గుడ్ల సముదాయం లేదా గుడ్లు కనిపించగానే 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలి.
8. గులాబీ రంగు పురుగు నివారణకు గుడ్డి పూలను ఏరివేయాలి. తొందరగా పక్వానికి వచ్చిన కాయలను ఏరివేసి, కాల్చివేయాలి.
9. పంటకాలాన్ని ఎట్టి పరిస్థితులలోనూ పొడిగించరాదు.
10. ఎకరాకు 100 ఎల్.ఇ. (పొగాకు లద్దె పురుగు), 200 ఎల్.ఇ. (శనగపచ్చ పురుగు) వైరస్ ద్రావణంను రాబిన్ బ్లూతో కలిపి సాయంత్రం వేళల్లో పిచికారి చేయాలి.
11. పురుగుల ఉధృతిని బట్టి 1 లేదా 2 సార్లు పచ్చిమిర్చి, వెల్లుల్లి కషాయం పిచికారి చేయాలి.
12. పంటకాలంలో కనీసం 2 నుంచి 3 సార్లు పశువుల పేడ + మూత్రం కషాయం పిచికారి చేయటం ద్వారా తల్లిపురుగులు పత్తిపంటమీద గుడ్లు పెట్టకుండా కొంతవరకు అరికట్టవచ్చును. ఈ కషాయం పంటకు పోషకాలను అందించి సహాయపడుతుంది కూడా.
13. నత్రజని ఎరువులను సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే వాడటం మంచిది.

# మిరపలో ముడత, కాయతొలుచు పురుగులు

**తామర పురుగు (పై ముడత) నివారణ :**

1. పొలంలో ఎకరానికి 5 చొప్పున తెల్లని జిగురు పళ్ళాలు ఉంచి పురుగును అదుపు చేయవచ్చు.
2. జొన్న లేదా మొక్కజొన్నతో పంటమార్పిడి చేయడం వలన పురుగు ఉధృతి తగ్గుతుంది.
3. 5 శాతం వావిలాకు కషాయం పిచికారి చేయాలి.
4. 3 శాతం వేపనూనె పిచికారి చేయాలి.

**నల్లి (కింది ముడత) నివారణ :**

1. సల్ఫర్ (గంధకం) పొడి చల్లడం వలన ఎర్రనల్లితో పాటు కొన్ని బూజు తెగుళ్ళు కూడా నివారణ అవుతాయి.
2. 5 శాతం వావిలాకు కషాయం పిచికారి చేయాలి.
3. 3 శాతం వేపనూనె పిచికారి చేయాలి.

**పచ్చ పురుగు, లద్దె పురుగు నివారణ :**

1. పొలంలో ఎకరానికి 4 చొప్పున లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు ఉధృతిని గమనించవచ్చు (పచ్చపురుగు, లద్దె పురుగులకు లింగాకర్షక బుట్టలు విడిగా దొరుకుతాయి).
2. పురుగు మందుల పిచికారి ఆపేయడం వల్ల పొలంలో రైతుమిత్ర పురుగులు పెరుగుతాయి. వీటిని మరింత ఎక్కువ చేయడానికి ట్రైకోగ్రామా పరాన్న జీవులను ఎకరానికి 60,000 చొప్పున (3 కార్డులు) పొలంలో పురుగు ఉధృతిని బట్టి 3-4 సార్లు వదలాలి.
3. తల్లి పురుగు గుడ్లు పెట్టకుండా 5 శాతం వేప కషాయాన్ని పిచికారి చేయాలి.
4. లార్వా చిన్న దశలో నివారించడానికి పచ్చిమిర్చి వెల్లుల్లి కషాయాన్ని పిచికారి చేయాలి.
5. ఎన్‌పివి ద్రావణం ఎకరానికి 500 ఎల్.ఇ. చొప్పున పిచికారి చేసి పురుగులలో వైరస్ తెగులును వ్యాప్తి చేయాలి (పచ్చ పురుగు, లద్దె పురుగులకు ఎన్.పి.వి. ద్రావణాలు విడిగా దొరుకుతాయి).
6. పొలంలో ఎకరానికి 10 చొప్పున పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలి.

# కందిలో పచ్చపురుగు నివారణ

కందిలో పూత మొదలయిందంటే పురుగు మొదలైనట్లే. తల్లి రెక్కల పురుగు పచ్చని పువ్వులకు ఆకర్షించబడి కందిచేనులో చేరుతుంది. చేనులో పచ్చపురుగు లార్వాదశ బాగా ఎదగకముందే నివారణ చర్యలు మొదలెట్టాల్సి ఉంటుంది. రెక్కల (తల్లి) పురుగు నుంచి గుడ్లు, గుడ్ల నుంచి పంటను తినే లార్వా దశ పురుగులు వస్తాయి. కనుక గుడ్డు దశ నుంచే చర్యలు చేపడితే నివారణ సులభం, ఖర్చు కూడా తగ్గుతుంది.

**నివారణ చర్యలు :**

1. ఒకటిన్నర కిలోల వేపగింజ నుంచి చేసిన వేప కషాయానికి 15 లీటర్ల నీరు కలిపి (ఒకపంపు), పంట దశను బట్టి తగిన మోతాదులో సాయంత్రపు వేళల్లో పిచికారి చేయాలి. పూత మొదలు కాగానే ఒకసారి, ఆ తరువాత 15 రోజులకు ఒకసారి వేప కషాయం పిచికారి చేయాలి.
2. రెండు లేక మూడు సార్లు వేపకషాయం పిచికారి చేసిన తరువాత కూడా పచ్చపురుగు లార్వాలు కనిపిస్తే 'దులిపే' పద్ధతి అనుసరించాలి. దులపడంవల్ల పూత రాలిపోతుందనేది అపోహ మాత్రమే. కందిలో 100 పువ్వులలో 70-80 పువ్వులు సహజంగానే రాలిపోతాయి. కనుక 'పూత రాలడం' అనే దాన్ని సమస్యగా భావించరాదు.

# వరిలో పురుగులను అదుపుచేసే పద్ధతి

**కాండం తొలుచు పురుగు నివారణ :**

1. లింగాకర్షక బుట్టలను ఎకరానికి ఒకటి చొప్పున పొలంలో పెట్టడం ద్వారా పురుగుల ఉనికిని తెలుసుకోవచ్చు.
2. పొలంలో రెక్కల పురుగులను కాని, పురుగు గుడ్లను కాని గమనించిన వెంటనే 5 శాతం వేప కషాయాన్ని పిచికారి చేసి గుడ్లు పెట్టడాన్ని నివారించాలి.
3. పురుగు మందు వాడని పొలాల్లో రైతుమిత్ర పురుగులు ఎక్కువగా ఉండడం వలన పురుగు గుడ్డు దశపై ఆశించే ట్రైకోగ్రామా పరాన్న జీవి ద్వారా సహజ సస్యరక్షణ జరుగుతుంది. అలా కానప్పుడు ఈ పరాన్న జీవులను ఎకరానికి 20,000 చొప్పున రెండు మూడు సార్లు పురుగు ఉధృతిని బట్టి పొలంలో వదలాలి.
4. నేలకు దగ్గరగా కోత కోయడం వలన పురుగు కోశస్థ దశలను నిర్మూలించి, రాబోయే పంటకాలంలో పురుగు ఉధృతిని తగ్గించవచ్చు.

**సుడి దోమ నివారణ :**

1. పొలంలో ఎప్పుడూ నీరు నిలువ ఉంచకుండా అప్పుడప్పుడు నీటిని తీసేస్తూ ఉండాలి (శ్రీ వరి సాగులో ఈ పురుగు ఉధృతి అతి తక్కువగా ఉంటుంది). ఇలా చేయడం వల్ల మొక్క మొదళ్ళ దగ్గర గాలిలో తేమ తక్కువగా ఉండడం వల్ల పురుగు వృద్ధి చెందదు.
2. ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాట వదలటం వలన గాలి బాగా ప్రసరించి పురుగు ఉధృతి తగ్గుతుంది.
3. ఇసుక లేకా యూరియా 15 కిలోలకి 1.5 లీటర్ల వేపనూనె బాగా పట్టించి, రాత్రంతా ఉంచి ఉదయాన్నే పొలంలో చల్లితే పురుగు ఉధృతి తగ్గుతుంది.
4. పురుగుమందుల పిచికారి ఆపేయడం వలన రైతు మిత్ర పురుగులైన రసం పీల్చు నల్లి (సిర్టోరైనస్), సాలీడు (లైకోసా) ద్వారా సహజ సస్యరక్షణ జరుగుతుంది.

# ఆముదంలో లద్దె పురుగు

లద్దె పురుగు ఆగష్టు నుండి - నవంబరు మాసాలలో ఆముదం పంటను నష్టపరుస్తుంది. లద్దె పురుగు నివారణకు చేపట్టవలసిన చర్యలు :

1. గుడ్ల సముదాయాలను, జల్లెడ మాదిరిగా మారిన ఆకులను ఏరివేయాలి.
2. ఎకరాకు 10-15 పంగల కర్రలు నాటాలి. దీని వలన పక్షులు పంట చేనులోకి చేరి లద్దె పురుగులను తినేస్తాయి.
3. ఎకరానికి 4-5 లింగార్షక బుట్టలను అమర్చి, పురుగు రాకను ముందుగా పసిగట్టి వేప కషాయం (1.5 కిలోల పిండి ఒక పంపుకు) పిచికారి చేయాలి.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.

☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in